సాక్షి నిజామాబాద్

ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



చట్టాన్ని ఉల్లంఘించే..

చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు.

- 8లో ▸



వెంటాడుతున్న వర్షం

జిల్లాలోని పలు చోట్ల శనివారం మధ్యాహ్నం వర్షం పడడంతో రోడ్లపై ఆరబెట్టిన మక్కలు తడిసిపోయాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.9 /22.2

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఘనంగా వెంకటస్వామి జయంతి



నిజామాబాద్‌అర్బన్: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ముత్తెన్న, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, పర్యవేక్షకుడు పవన్ పాల్గొన్నారు.

టీజీవో జిల్లా అధ్యక్షుడిగా అలుక కిషన్



నిజామాబాద్ నాగారాం : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా అలుక కిషన్ ఎన్నికయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఎన్నిక నిర్వహించగా.. అధ్యక్షుడిగా కిషన్, సెక్రెటరీగా సంగం అమృత్‌కుమార్ నామినేషన్లు వేశారు. సింగిల్ నామినేషన్లు దాఖలు కావడంతో వారిద్దరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో టీజీవో కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు సాయిరెడ్డి, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, సహాధ్యక్షులు చిట్టి నారాయణరెడ్డి, టీజీవో జిల్లా కోశాధికారి దేవీసింగ్, ఉపాధ్యక్షులు రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రవీణ్ , వినయ్‌కుమార్, కీర్తి రాజు పాల్గొన్నారు. ఆయా శాఖల అధికారులు నూతనంగా ఎన్నికైన టీజీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులను సన్మానించారు.

ముగిసిన ధ్రువపత్రాల పరిశీలన



నిజామాబాద్ అర్బన్: నగరంలోని నిర్మల హృదయ పాఠశాలలో నాలుగు రోజులుగా డీఎస్సీ– 2024 మెరిట్ అభ్యర్థులకు నిర్వహిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన శనివారం ముగిసింది. జిల్లా అబ్జర్వర్, విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్ చివరి రోజు ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ పరిశీలించారు. వివరాల నమోదు తదితర అంశాలను డీఈవో దుర్గాప్రసాద్‌ను అడిగారు. 1,321 మంది అభ్యర్థులకు 1,250 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

నిజాంసాగర్‌లోకి 8 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శనివారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 8 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నాలుగు గేట్లను ఎత్తి 20 వేల క్యూసెక్కులను మంజీరలోకి వదులుతున్నారు. ప్రధాన కాలువకు 2 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 1,404.98 అడుగుల (17.773 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.



డిచ్‌పల్లిలో సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు



జిల్లా కోర్టులో బతకమ్మతో జిల్లా జడ్జి సునీత కుంచాల, సిబ్బంది

ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ

జిల్లావ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఉత్సాహంగా ఆడుతున్నారు. శనివారం జిల్లా కోర్టులో జిల్లా జడ్జి సునీతా కుంచాల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలో సద్దుల బతుకమ్మ ఆడారు. కోర్టులో జరిగిన కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ ప్రధాన కార్యదర్శి పద్మావతి, ఫస్ట్‌కాస్ మేజిస్ట్రేట్ కుష్బూ పాల్గొన్నారు. ఖలీల్‌వాడి/డిచ్‌పల్లి

జిల్లాలోనూ హైడ్రా

- ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తుపై నిర్ణయం తీసుకోలేదు
- మీడియాతో చిట్‌చాట్‌లో పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌లో హైడ్రా లాంటి వ్యవస్థ వస్తుందని, ఎన్ని ఒత్తిడిలు వచ్చినా అది ఆగదని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ఇంటర్‌నేషనల్ హోటల్‌లో విలేకరులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాల్లో హైడ్రా తరహా వ్యవస్థ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లానని చెప్పారు. ప్రభుత్వ భూములు, చెరువులు, దేవాలయ భూములు, వక్ఫ్‌భూములు కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటుందన్నారు. దీనిపై కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. జిల్లాలో మరో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2025 నాటికి సీఎంసీ మెడికల్ కళాశాల అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. పారిశ్రామికంగా, వైద్య పరంగా జిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపిస్తామన్నారు. రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నాటకాలు ఆడుతుందని విమర్శించారు. సాంకేతికంగా ఇబ్బందులు ఉన్న రైతులకు కూడా రుణమాఫీ అందుతుందన్నారు.

త్వరలో నామినేటెడ్ పదవుల భర్తీ

బీఆర్ఎస్ పదేళ్లలో రూ.7.50 లక్షల కోట్లు అప్పులు చేసిందన్నారు. ప్రస్తుతం నిధులు లేకున్నా పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఎక్కడ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని మీడియా ప్రశ్నలకు కాంగ్రెస్ అధిష్టానం ఎక్కడ నుంచి పోటీ చేయమంటే అక్కడి నుంచి చేస్తానన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో ఎంఐఎంతో పొత్తుపై ఇప్పటివరకు స్పష్టత లేదన్నారు. పరిస్థితులను బట్టి నిర్ణయం ఉంటుదన్నారు. నామినేటెడ్ పదవులను త్వరలోనే భర్తీ చేస్తామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి అవకాశం లభిస్తుందని చెప్పారు. మంత్రివర్గంలో జిల్లాకు ఖచ్చితంగా ప్రాతినిధ్యం ఉంటుందన్నారు. నిజామాబాద్ స్మార్ట్ సిటీ జాబితాలో ఉండాల్సిందేనని, దీంతో రూ.500 కోట్లు వస్తాయన్నారు. కొందరి అసమర్థత స్మార్ట్ జాబితాలో రాలేదన్నారు. మూడేళ్లు పూర్తయిన డీసీసీ అధ్యక్షుల మార్పు ఉంటుదని, దీంతోపాటు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన వారికి అవకాశాలు కల్పిస్తామన్నారు.



సుద్దపల్లి శివారులోని సీఎంసీ కాలేజీ వద్ద మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత

డిచ్‌పల్లి: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి శివారులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీ (సీఎంసీ) ఆస్పత్రి వైద్యుల కోసం నిర్మించిన క్వార్టర్స్‌ను శనివారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. చర్చి ఆఫ్ సౌతిండియా (సీఎస్ఐ) ఆధ్వర్యంలో 2025 లో సీఎంసీ పునఃప్రారంభించుకోవాలన్నారు. మెడికల్ కాలేజీ ఏర్పాటుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇందుకు కావాల్సిన అన్ని సాంకేతిక, మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవాలని సీఎస్ఐ ప్రతినిధులకు సూచించారు. ఒకప్పుడు కుష్టువ్యాధి అంటేనే అందరూ భయపడేవారని, 1900 సంవత్సరంలో డిచ్‌పల్లిలో సీఎస్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విక్టోరియా హాస్పిటల్ ద్వారా దేశానికే చికిత్స అందించిన గొప్ప చరిత్ర ఉందన్నారు. సీఎంసీ ఆవరణలో ఉన్న స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని నిర్వాహకులకు సూచించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. డిచ్‌పల్లి సీఎంసీ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, కేశ వేణు, నరాల రత్నాకర్, మునిపల్లి సాయారెడ్డి, సీఎస్ఐ మెదక్ డయాసిస్ వైస్ చైర్మన్ రెవరెండ్ రూబెన్ మార్క్, మినిస్టీరియల్ సెక్రెటరీ జయానంద్, విమల్‌సుకుమార్ పాల్గొన్నారు.

'అంకు పరివార్'

- బోధన్‌లో ప్రత్యేకత చాటుకుంటున్న ఉమ్మడి కుటుంబం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: 'అంకు పరివార్'.. బోధన్ పట్టణం నడిబొడ్డులోని అంబేద్కర్ చౌరస్తాలో ఈ పరివార్ ప్రత్యేకంగా నిలుస్తోంది. నలుగురు అన్నదమ్ములు కలిసి ఉమ్మడి కుటుంబంగా కొనసాగుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నిజామాబాద్‌లోని గాజుల్‌పేటకు చెందిన అంకు రాంరెడ్డి దశాబ్దాల క్రితం బోధన్‌కు చెందిన రాధాబాయిని వివాహం చేసుకుని ఇల్లరికం వెళ్లారు. రాంరెడ్డి, రాధాబాయి కాలం చేసినప్పటికీ వారి నలుగురు కుమారులు ఇప్పటికీ ఉమ్మడి కుటుంబంగానే కొనసాగుతున్నారు. ఉమ్మడిగానే వ్యాపారాలు చేస్తున్నారు. సంతోష్‌రెడ్డి, రాజశేఖర్, దామోదర్, మహేష్ అన్నదమ్ములు కాగా వీరికి ముగ్గురు అక్కలు ఉన్నారు. ఈ నలుగురు అన్నదమ్ములకు కలిపి 9 మంది సంతానం. ఐదుగురు కుమార్తెలు, నలుగురు కుమారులు. వీరిలో ముగ్గురు కుమార్తెలకు వివాహాలు చేశారు. కొందరు కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తుండగా, కొందరు చదువుకుంటున్నారు. ఈ కుటుంబానికి ఆహ్వాన పత్రికలు ఇచ్చేవారెవరైనా ఒకే కార్డును అంకు పరివార్ పేరిట అందజేస్తారు. వీళ్ల ఇంట్లో శుభకార్యాలు ఉన్నప్పుడు నలుగురు దంపతుల పేరిట ఆహ్వాన పత్రికలు ముద్రించి పంపిణీ చేస్తున్నారు. కాగా దామోదర్ భార్య సంధ్య బోధన్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఉన్నారు.

■ నలుగురు అన్నదమ్ముల తోబుట్టువులైన ముగ్గురు ఆడబిడ్డల్లో ఇద్దరిని మహారాష్ట్రలోని పుణె నగరంలోని ఉమ్మడి కుటుంబానికి చెందిన అన్నదమ్ములకే ఇచ్చి వివాహం చేశారు. పూణేలో ఉంటున్న ఈ కుటుంబం మూడు తరాల క్రితం తెలంగాణ నుంచి వెళ్లినవారే. వీరు కూడా నలుగురు అన్నదమ్ములు కావడం గమనార్హం. ఇదిలా ఉండగా పుణెలో ఉంటున్న ఆ ఉమ్మడి కుటుంబానికే చెందిన వారికి వీరి ఇద్దరి కుమార్తెలను ఇచ్చి పెళ్లి చేశారు. ఇద్దరు కుమార్తెలను ఇద్దరు మేనల్లుళ్లకు ఇచ్చినట్లయింది.

సండే స్పెషల్



తమ కుటుంబ సభ్యురాలి ఎంగేజ్‌మెంట్ వేడుకలో అంకు పరివార్ (ఫైల్)

గర్భంలో మృత శిశువుతో మూడు రోజులు

ఆర్మూర్‌టౌన్: వైద్యులు, స్కానింగ్ సెంటర్ తప్పిదం వలన ఓ నిండు గర్భిణి మృత శిశువుతో మూడు రోజుల పాటు ఉండాల్సి వచ్చింది. చివరకు విషయం తెలిసిన కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిరికొండ మండలం రూప్ల తండాకు చెందిన బానవత్ మంజుల రెండో కాన్పు నిమిత్తం ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది. తొమ్మిది నెలలు నిండగా మూడ్రోజుల క్రితం ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లో స్కానింగ్ తీయించుకుని రిపోర్టును ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారిణికి చూపించింది. శిశువు గుండె చప్పుడు తక్కువగా ఉందని ఆస్పత్రి వైద్యురాలు తెలిపింది. కాగా శనివారం అస్వస్థకు గురికావడంతో కుటుంబ సభ్యులు గర్భిణిని భీంగల్‌లోని ఓ ప్రవేట్ ఆస్పత్రి తీసుకెళ్లారు. స్కానింగ్ రిపోర్టు పరిశీలించిన వైద్యులు మూడు రోజుల కిత్రమే శిశువు మృతి చెందినట్లు తెలిపారు. దీంతో బాధితులు ఆర్మూర్ ఆస్పత్రికి చేరుకుని ప్రభుత్వ ఆస్పత్రిలోని వైద్యురాలిని నిలదీశారు. కొద్ది సేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఆస్పత్రి వైద్యులు బాధిత కు టుంబ సభ్యలను సముదాయించి మెరుగైన చికి త్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా స్కా నింగ్ రిపోర్టులో గర్భంలోని శిశువు డెత్ అని, దాని కింద బేబీ గ్రోత్ లేదని పేర్కొన్నారని వైద్యురాలు తెలిపింది. అందువల్లే తాను మూడు రోజులకు మందులకు ఇచ్చానని ఆందోళన చేసిన వారికి తెలిపింది.



ఆస్పత్రిలో గర్భిణి, కుటుంబ సభ్యులు

వైద్యులు సమయపాలన పాటించాలి

- తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

నిజామాబాద్ నాగారం: వైద్యులు సమయపాలన పాటించాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. శనివారం నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. వైద్యులు అప్రాన్ (తెల్లకోట్, స్టెటత్‌స్కోప్) ధరించాలన్నారు. అప్రాన్ వేసుకోకుంటే ఆస్పత్రికి వచ్చే రోగులకు, వారి బంధువులకు మీరు వైద్యులని ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. రోగుల వివరాలు కచ్చితంగా రిజిస్టర్‌లో నమోదు చేయాల్సిందేనని పేర్కొన్నారు. సూపరింటెండెంట్ చాంబర్‌లో అందిస్తున్న సేవలు, ఏర్పాట్లపై సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ రోగులకు ఓపీ స్లిప్ ఇవ్వడమే కాకుండా, సదరు రోగి పేరు, ఎలాంటి రోగాలు ఉన్నాయని తదితర వివరాలు కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.

మందులు అందుబాటులో ఉంచాలి

ప్రభుత్వ ఆస్పత్రికి ఓపీ పెరుతున్న దృష్ట్యా అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మందులు లేవని రోగులను బయటకు పంపొద్దని పేర్కొన్నారు. రక్త పరీక్షలు సైతం పక్కాగా ఉండేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబులుతున్న దృష్ట్యా మందుల కొరత లేకుడా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రాజశ్రీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమా రాజ్, వైద్య విదాన పరిషత్ జిల్లా అధికారి శ్రీనివాస్ ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి తుకారాంరాథోడ్ ఉన్నారు.



జీజీహెచ్‌లో రికార్డులు పరిశీలిస్తున్న తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

వైద్యుల కొరత తీర్చడానికి చర్యలు

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత తీర్చడానికి చర్యలు చేపడుతున్నట్లు వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎటువంటి సౌకార్యాలు ఉన్నాయో, ఇంకా ఏం కావాలో వివరాలను సేకరిస్తున్నామన్నారు. నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని ఆస్పత్రులను సందర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆస్పత్రిలో నిరుపయోగంగా స్కానర్ అందుబాటులో తీసుకు వచ్చే విధంగా చూస్తామన్నారు. డీసీహెచ్ఎస్ శ్రీనివాస్‌ప్రసాద్, ఆర్మూర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రవికుమార్, వైద్యులు అమృత్‌రాంరెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.





చంద్రఘంట దేవిగా..

మండల కేంద్రంలో సత్య గంగవ్వ మండపంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి శనివారం మూడో రోజు చంద్రఘంట దేవి (గాయత్రి)గా దర్శనమిచ్చింది. మండపం వద్ద హోమం చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుమ్మడికాయలను దేవివద్ద ఉంచారు.

– దొంకేశ్వర్(ఆర్మూర్)

కిటకిటలాడిన మేకల సంత



- దసరా నేపథ్యంలో రూ.3 కోట్లకు పైగా లావాదేవీలు

నవీపేట: నవీపేటమే మేకల సంత శనివారం వ్యాపారులు, వినియోగదారులతో కిటకిటలాడింది. ఈనెల 12న దసరా కావడంతో సంతలో క్రయవిక్రయాలు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. సంత ప్రాంగణంలో స్థలం సరిపోకపోవడంతో బస్టాండ్ ప్రాంగణంతో పాటు బాసర రహదారికి ఇరువైపులా క్రయవిక్రయాలు జరిపారు. ఈ సంతలో రూ.3 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు వ్యాపారులు పేర్కొన్నారు.

ఎస్సారెస్పీకి తగ్గిన వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి వచ్చే వరద ఆధారంగా అధికారులు దిగువకు నీటిని వదులుతున్నారు. శుక్రవారం రాత్రికి ఇన్‌ఫ్లో పెరగడంతో నాలుగు గేట్లను ఎత్తి 12,500 క్యూసెక్కులను దిగువకు వదిలారు. శనివారం మధ్యాహ్నం ఇన్‌ఫ్లో 47 వేల క్యూసెక్కులకు పెరగడంతో 8 గేట్ల ద్వారా 25 వేల క్యూసెక్కులను గోదావరిలో కి వదిలారు. సాయంత్రానికి ఇన్‌ఫ్లో 22 వేల క్యూసెక్కులకు తగ్గిపోవడంతో గేట్ల ద్వారా నీటి విడుదలను నిలిపివేశారు. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 6,800 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200 క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 150 క్యూసెక్కులు వదులుతున్నారు. ఆవిరి రూపంలో 709 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగుల(80.5టీఎంసీలు)తో నిండుగా ఉంది.



క్లుప్తంగా

పేదల పెన్నిధి వెంకట స్వామి

- కాకా జయంతి వేడుకల్లో పలువురు వక్తలు, అధికారులు



ఖలీల్‌వాడి: పేదల పెన్నిధిగా కేంద్ర మాజీ మంత్రి దివంగత వెంకటస్వామి (కాకా) పేరు గాంచారని పలువురు అధికారులు, వక్తలు అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో వెంకటస్వామి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు సీపీ కార్యాలయంలో మాజీ కేంద్రమంత్రి వెంకటస్వామి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి డీసీపీ కోటేశ్వర్‌రావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, రాష్ట్ర సాధన పోరాటాల్లో అన్ని దశల్లోనూ స్ఫూర్తిని నింపారని కొనియాడారు. కార్యక్రమంలో డీసీపీ (ఏఆర్) శంకర్ నాయక్, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, పీసీఆర్, సీఐ శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, బషీర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. రేంజ్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మేనేజర్ టీ రాజప్రసాద్, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోవులను తరలిస్తున్న వాహనం అడ్డగింత

- ఇరువర్గాల మధ్య వాగ్వాదం
- నస్రుల్లాబాద్‌లో భారీగా మోహరించిన పోలీసు బలగాలు

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో గోవులను రవాణా చేస్తున్న వాహనాన్ని బీజేపీ భజరంగ్‌దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారు. బాన్సువాడ పట్టణ కేంద్రానికి చెందిన ఖురేషి అనే వ్యక్తి నిజామాబాద్ నుంచి బాన్సువాడకు గోవులను తరలిస్తున్న విషయం తెలుసుకున్న భజరంగ్‌దళ్ నాయకులు నస్రుల్లాబాద్‌లో అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ సీఐ సత్యనారాయణగౌడ్, బీర్కూర్ ఎస్సై రాజశేఖర్, ఏఆర్ పోలీస్ బలగాలతో ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. వాహన డ్రైవర్ ఖురేషిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెంకట్రావు తెలిపారు.

మక్క రైతును వెంటాడుతున్న వర్షం

- తడిసి ముద్దయిన మక్కలు
- ఆందోళనలో రైతులు



నాగంపేట్ శివారులో వర్షం నీటిలో నుంచి మక్కలను తీస్తున్న రైతు



తడిసిన మక్కలు

బాల్కొండ: మక్క రైతులను వర్షం వెంటాడుతోంది. శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో నూర్పిళ్లు చేసి రోడ్లపై ఆరబోసిన మక్కలు తడిసిముద్దయ్యాయి. తడిసిన మక్కలను వర్షపు నీటిలో నుంచి తీసేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. ప్రతి సంవత్సరం పంట దిగుబడి వచ్చే సమయంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. గత పదిహేను రోజులుగా వర్షాలు కురుస్తుండగా, మధ్యలో గత మూడు రోజులపాటు వర్షాలు లేకపోవడంతో రైతులు పెద్ద మొత్తంలో మక్కలను నూర్పిడి చేసి రోడ్లపై ఆరబోశారు. శనివారం మళ్లీ వర్షం దంచికొట్టడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. శనివారం మధ్యాహ్నం నుంచి ముప్కాల్ మండల పరిధిలోని కొత్తపల్లి, నాగంపేట్, రెంజర్ల, వెంచిర్యాలలో భారీ వర్షం కురిసింది. ఇప్పటికే వ్యాపారులు సిండికేట్‌గా మారి మక్కల ధర తగ్గించారు. క్వింటాల్‌కు రూ.2,350 చెల్లిస్తూ ప్రస్తుతం కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా తడిసిన మక్కలకు మరింత ధర తగ్గిస్తారని ఆందోళన చెందుతున్నారు. తడిసిన మక్కలు రంగు మారుతాయని, గింజలు మొలకెత్తే ప్రమాదం ఉందని అంటున్నారు. సోయా సైతం వర్షానికి తడిసిందని, కొద్దిగా తడిసినా మొలకెత్తుతుందని ఆందోళన చెందుతున్నారు. తడిసిన మక్కలు, సోయాను ప్రభుత్వం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఒక్కసారిగా వానొచ్చింది

శనివారం మధ్యాహ్నం ఒక్క సారిగా వాన దంచి కొట్టింది. రోడ్లపై ఆరబోసిన మక్కలు మొత్తం నీటి పాలయ్యాయి. వర్షంపు నీటిలో నుంచి మక్కలను ఎత్తుకోవాల్సి వచ్చింది. ఆరబోయడం అవస్థ అవుతోంది. మక్కల ధరను తగ్గిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలి. – చిన్నయ్య, రైతు, రెంజర్ల

క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే 'టార్చ్ రిలే'



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్

- ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

నిజామాబాద్ నాగారం: క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి 'టార్చ్ రిలే'ను ప్రారంభించారని ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్–2024 క్రీడా పోటీల 'టార్చ్ రిలే' శనివారం సాయంత్రం జిల్లా కేంద్రానికి చేరింది. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మహేశ్‌కుమార్ గౌడ్ టార్చ్ రిలేకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చేపట్టిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. క్రీడాకారులు, ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న పోలీసు సిబ్బంది, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. టార్చ్ రిలేను చేతబూని, పులాంగ్ చౌరస్తా నుంచి పాలిటెక్నిక్ కళాశాల మైదానం వరకు ర్యాలీ చేపట్టారు. ప్రతి క్రీడాకారుడు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ముత్తెన్న అన్నారు. రాష్ట్ర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటేలా వారిని తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే సీఎం కప్ పోటీల గురించి క్రీడాకారులకు తెలిసేలా విస్తృత ప్రచారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, ముఖ్య పట్టణాలు, నగరాల మీదుగా టార్చ్ రిలే కొనసాగుతోందని అన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్ రెడ్డి, టార్చ్‌రిలే కార్యక్రమ రాష్ట్ర సమన్వయకర్త కె మధు, సంబంధిత శాఖల అధికారులు, క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులకు మతి భ్రమించింది



మాట్లాడుతున్న చైర్మన్ అన్వేష్‌రెడ్డి

ఆర్మూర్: రాష్ట్ర ప్రభుత్వం సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ.. బీఆర్ఎస్ నాయకులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదంటూ మతిభ్రమించి మాట్లాడుతున్నారని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి విమర్శించారు. ఆర్మూర్ పట్టణంలోని విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో ఏనాడూ రైతుల గురించి ఆలోచించని బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు సవితి తల్లి ప్రేమను ఒలకబోస్తున్నారన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రైతులకు అన్ని రకాలుగా పెద్దపీట వేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని కొనియాడారు. వ్యవసాయ శాఖ మంత్రి ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. సమావేశంలో రైతు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై చర్యలు



నిజామాబాద్ నాగారం: చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. వైద్యారోగ్య శాఖకు చెందిన పీసీపీఎన్డీటీపై శనివారం జిల్లా స్థాయి సమావేశాన్ని అడిషనల్ కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించారు. కొత్తగా స్కానింగ్ సెంటర్ ప్రారంభించాలనుకునే వారికి అనుమతుల మంజూరుపై నిర్ణయం తీసుకోవడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలని, చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఐసీడీఎస్, పోలీస్, ఎన్జీవోల సహాయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఎన్జీవోలను భాగస్వాములను చేయాలని సూచించారు. స్త్రీ, పురుష నిష్పత్తిలో రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లా పురోగతి సాధించాలని, అన్ని స్కానింగ్ కేంద్రాలను కచ్చితంగా సకాలంలో సందర్శించి నివేదికలను సమర్పించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి రాజశ్రీతోపాటు ఏసీపీ, జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బీ, వైద్యారోగ్యశాఖ ఉద్యోగులు, డీఈవో పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగాలి

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



భిక్కనూరులో ఏఎంసీ పాలకవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న షబ్బీర్ అలీ, షెట్కార్

భిక్కనూరు: ప్రజల చేతిలో చావుదెబ్బతిన్న కేసీఆర్ ఫాంహౌజ్‌లో సేద తీరుతుండగా ఆయన కుమారుడు కేటీఆర్, అల్లుడు హరీశ్‌రావులు ప్రజలను మభ్యపెట్టడంతో బిజీబిజీగా ఉన్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విమర్శించారు. శనివారం భిక్కనూరు ఏఎంసీ ప్రమాణ స్వీకారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలప్పుడే పార్టీలను చూడాలని ఎన్నికలయ్యాక అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. రైతు సంక్షేమానికి కేసీఆర్ పదేళ్ల పాలనలో రూ.25 వేల కోట్లు వెచ్చిస్తే సీఎం రేవంత్‌రెడ్డి తన తొమ్మిది నెలల పాలనలో రూ.25 వేల కోట్లను వెచ్చించారన్నారు. పదేళ్ల క్రితం అద్దె ఇళ్లలో ఉన్న ఎమ్మెల్సీ కవిత, ఎంపీ సంతోష్‌రావులకు నేడు హైదరాబాద్‌లో సొంత ఇళ్లు ఎన్నో ఉన్నాయన్నారు.

రైతు రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యం: షెట్కార్

రైతు రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ఆరు నూరయినా సరే ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు 21, 22 ప్యాకేజీ పనులు పూర్తి చేసి కామారెడ్డి ప్రాంతంలోని భూములను సస్యశ్యామలం చేస్తామని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ అన్నారు. శనివారం ఆయన భిక్కనూరు ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని రైతులు, ప్రజలనుద్దేశించి మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్సార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీల చిరకాల స్వప్నమైన ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రం కేసీఆర్ హయాంలో రూ.7 లక్షల 50 వేల కోట్ల అప్పుల్లోకి వెళ్లిందన్నారు. షబ్బీర్‌అలీ చొరవతోనే భిక్కనూరు ఏఎంసీ 2013లో ఏర్పాటైందని గుర్తు చేశారు కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, నేతలు జనగామ వేణుగోపాల్‌రెడ్డి, బల్యాల సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గం ప్రమాణ స్వీకారం

భిక్కనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా పాత రాజు, వైస్ చైర్మన్‌గా పాపనోల్ల స్వామి డైరెక్టర్లుగా తోట రమేష్, కదిరే గోపాల్‌రెడ్డి, పోగుల సాయిలు, భిక్యాజీ దిలీప్‌కుమార్, లంబాడి భాస్కర్, కల్లురి సిద్ధరాములు, నాగార్తి రమేష్‌రెడ్డి, బాబుమియా, తాటికొండ మల్లేషం, బలుస్కుల మమత, కొడిప్యాక వెంకటేశం, యెర్రం అమర్, గంగళ్ల భూమయ్యలు ప్రమాణ స్వీకారం చేశారు.

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ పి లక్ష్మీనర్సయ్య

ఖలీల్‌వాడి: పోలీసు అధికారులు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం 2023పై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి లక్ష్మీనర్సయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి వైజయంతి ఆదేశాల మేరకు శనివారం నిజామాబాద్ డివిజన్ పోలీస్ అధికారులకు సమీక్ష నిర్వహించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మహ్మద్ రహీముద్దీన్, భూసారపు రాజేశ్‌గౌడ్ నూతన చట్టాలను క్లుప్తంగా వివరించారు. ప్రతి కేసు నూతన చట్టాల ప్రకారం చార్జిషీట్ చేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజారెడ్డి, బంటు వసంత్, నిజామాబాద్ డివిజన్ సీఐలు, ఎస్సైలు, అటవీశాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ వద్ద రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు శనివారం పట్టుకున్నారు. పాల్వంచ మండలం భవానీపేట తండాకు చెందిన బానోత్ రాములు రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేందుకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్రైం కార్నర్

పాన్‌షాప్ దగ్ధం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు ఓ పాన్ షాప్ దగ్ధమైంది. అటుగా వెళ్తున్న వారు గమనించి పాన్‌షాప్ యజమాని సతీశ్‌తోపాటు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. సుమారు లక్షన్నర ఆస్తినష్టం సంభవించినట్లు బాధితుడు సతీశ్ తెలిపారు.

జేబుదొంగల చేతివాటం

భిక్కనూరు: మండల కేంద్రంలోని గంజ్ ప్రాంతంలో శనివారం నిర్వహించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ కార్యక్రమంలో జేబు దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. నాయకుల జేబుల్లో నుంచి నగదు చోరీ చేశారు. మాజీ ఎంపీపీ తోగరి సుదర్శన్ జేబులో నుంచి రూ.10 వేలు, రాజంపేట మండలానికి చెందిన రాజు జేబులో నుంచి రూ.5,600, సాయిలు జేబులో నుంచి రూ.2,200, కామారెడ్డి పట్టణానికి చెందిన ఓ నాయకుడి జేబులో నుంఇ రూ.11,700 చోరీ చేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నవీపేట: మండలంలోని ధర్మారం(ఎం) గ్రామానికి చెందిన యువకుడు శుక్రవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్సై వినయ్ శనివారం తెలిపారు. ఇల్లు కట్టుకునే సమయంలో అదే గ్రామానికి చెందిన నర్సయ్య దగ్గర ప్రవీణ్‌గౌడ్ కొద్ది రోజుల క్రితం రూ.50 వేలు అప్పు చేశాడని, డబ్బుల కోసం నర్సయ్య ఇటీవల వేధించడంతో ప్రవీణ్ మనస్తాపానికి గురయ్యాడన్నారు. వేధింపులు భరించలేక పురుగుల మందు తాగిన ప్రవీణ్‌ను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారన్నారు. బాధితుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ చోరీ కేసులో అరెస్ట్

ఖలీల్‌వాడి: బైక్‌ల చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు రెండో టౌన్ ఎస్సై అరాఫత్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రెండో టౌన్ పీఎస్ పరిధిలోని ఆర్ఆర్ చౌరస్తా వద్ద శనివారం సాయంత్ర వాహనాల తనిఖీ చేపడుతుండగా నగరంలోని ధర్మపురిహిల్స్‌కు చెందిన నీల నర్సింహ, మోపాల్ మండలం ముదక్‌పల్లికి చెందిన ఫిరోజ్‌ఖాన్ వెళ్తున్న బైక్‌ను ఆపి తనిఖీ చేయగా ఎలాంటి పత్రాలు లభించలేదు. దీంతో వీరిపై అనుమానం రావడంతో అదుపులోకి తీసుకొని విచారింగా పలు చోట్ల ఐదు బైక్‌లను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో బైక్‌లను స్వాధీనం చేసుకొని వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పరిస్థితి విషమించి ఒకరి మృతి

భిక్కనూరు: ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన భిక్కనూరు మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కోరె బీరయ్య(50) రెండేళ్లుగా ఎలాంటి పనులు చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తితో గత నెల 25న బీరయ్య కల్లులో పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబీకులు కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ

నిజామాబాద్ రూరల్: మండలంలోని ఆకుల కొండూర్ గ్రామంలోని లిఫ్ట్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి దుండగులు కాయిల్స్ ఎత్తుకెళ్లినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ తెలిపారు. శనివారం లిఫ్ట్ వద్దకు వెళ్లిన గ్రామస్తులు ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ అయినట్లు గుర్తించారన్నారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి



పల్లె పద్మారావు(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్ గ్రామానికి చెందిన పల్లె పద్మారావు(47) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు పోచారం ప్రధాన కాలువలో పడి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. గత నెల 25వ తేదీన ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన పద్మారావు తిరిగిరాకపోవడంతో పలుచోట్ల గాలించిన కుటుంబ సభ్యులు చివరికి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా శనివారం గ్రామశివారులోని పోచారం ప్రధానకాలువ కల్వర్టు మెట్ల వద్ద మృతుడి చెప్పులు కనిపించడంతో జాలర్ల సహాయంతో గాలించారు. ప్రధానకాలువలోని తుమ్మచెట్టు ముళ్ల కింద నీటిలో పద్మారావు మృతదేహం లభ్యమైంది. పద్మారావు ప్రమాదవశాత్తు ప్రధానకాలువలో పడి మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామని ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో ఉమేశ్ తెలిపారు.

కుంటలో పడి..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రాకాసీపేట్ ప్రాంతానికి చెందిన దాల్ మల్క నర్సింలు(40) ప్రమాదవశాత్తు కరుణం కుంటలో పడి మృతి చెందాడని పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. పట్టణంలోని రాకాసీపేట్‌కు చెందిన శుక్రవారం రాత్రి మద్యం సేవించిన నర్సింలు తన ఇంటి సమీపంలోని కుంటలో ప్రమాదవశాత్తు పడిపోయాడని, స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకొని నర్సింలు మృతదేహాన్ని బయటికి తీయించామన్నారు. మృతుడికి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పీడీఎస్ సిండికేట్‌లో కలవడం లేదని దాడి

ఖలీల్‌వాడి: పీడీఎస్ బియ్యం దందా సిండికేట్‌లో కలవడం లేదని ఓ గ్యాంగ్ మరో గ్యాంగ్‌పై దాడికి పాల్పడినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి శనివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రాండ్ ప్లాజా వద్ద మజార్ అలియాస్ చోటు, హంజల, నోమాన్ అనే యువకులపై సిద్దిఖీ, అప్సర్ అనే ఇద్దరు అన్నదమ్ములతోపాటు మరి కొంత మంది కలిసి దాడి చేశారు.

ఒకేసారి గ్యాంగ్ దాడి చేయడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. గాయాలపాలైన వారిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం రాత్రి సమావేశమైన రెండు గ్యాంగ్‌లు పీడీఎస్ బియ్యం దందాను కలిసి చేయాలని నిర్ణయానికి వచ్చారు. శనివారం ఓ గ్యాంగ్ వారు పీడీఎస్ బియ్యం దందాను వేరుగా చేయడంతో మరో గ్యాంగ్ వారు దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఈ ప్రాంతంలో పీడీఎస్ బియ్యం దందా యథేచ్ఛగా కొనసాగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కారును ఢీకొన్న లారీ



ఘటనాస్థలంలో లారీ, కారు

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ శివారులో కారును లారీ ఢీకొన్న ఘటనలో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలైనట్లు ఎస్సై సాయికుమార్ శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తాడ్వాయి మండలం బ్రాహ్మణ్‌పల్లి గ్రామానికి చెందిన మరాఠి శ్యామ్‌కుమార్ తన కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బంధువులను తీసుకుని వస్తుండగా బస్వాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న లారీ అతి వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొన్నది. కారు కామారెడ్డి వైపు నుంచి హైదరాబాద్ వైపు మళ్లింది. దీంతో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఖలీల్‌వాడి: రోడ్డు దాటుతున్న ఓ మహిళను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటన జిల్లా కేంద్రంలోని దేవీ థియేటర్ చౌరస్తా వద్ద శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బోధన్‌కు చెందిన గోసం గంగు, భర్త రాజులు పని నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చారు. పులాంగ్ నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు దేవీ థియేటర్ చౌరస్తాలో ఢీకొన్నది. ఈ ఘటనలో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపడం వల్లే ప్రమాదం చోటు చేసుకుందని బాధిత కుటుంబీకులు డ్రైవర్‌తో గొడవ పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఇరువురిని సముదాయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

భిక్కనూరులో వానరాల దండు



భిక్కనూరు: వానరాల దండు రోడ్లపైకి రావడంతో మండల కేంద్రవాసులు బెంబేలెత్తారు. శనివారం మండల కేంద్రంలోని ఊరడమ్మ దేవాలయం నుంచి పెద్ద కోతులగుంపు అంబేడ్కర్ విగ్రహం వద్దకు వచ్చింది. వీధుల్లో ఉన్న వారు భయంతో ఇళ్లలోకి వెళ్లిపోయారు. ఆ తరువాత వానరాల గుంపు సమీపంలోని కొత్త చెరువు వద్దకు వెళ్లిపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.


రెజ్లింగ్‌లో ఉమ్మడి జిల్లా సత్తా



నిజామాబాద్‌నాగారం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14, 17 బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి (నిజామాబాద్, కామారెడ్డి) జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు నారాయణపేట జిల్లాలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు కొనసాగాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు నాగమణి, హీరాలాల్ క్రీడాకారులను అభినందించారు.

అండర్ – 17: నేహాబేగం, సింధు(బంగారు), సుజిత, త్రిష, స్నేహప్రియ(కాంస్యం)
అండర్ – 14: జయశ్రీ (రజతం), కావేరి, స్రవంతి (కాంస్యం).

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయికి ఎంపిక



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14, 17కి జిల్లా కేంద్రంలోని అభ్యాస స్కూల్ క్రీడాకారులు ఎంపికయ్యారు. క్రీడాకారులను స్కూల్ కరస్పాండెంట్ చెన్న అన్నపూర్ణ శనివారం ప్రత్యేకంగా అభినందించారు. పీఈటీ ఆకుల నాగరాజు పాల్గొన్నారు. అండర్–17 ఫుట్‌బాల్‌కు సాయిసమీక్ష, అండర్ – 14 క్రికెట్‌కు ప్రజ్వల్, భానుచందర్ ఎంపికయ్యారు.